ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

7



• కొల్లేరుకు విదేశీ చుట్టాలు

కొల్లేరు సరస్సులో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఏటా శీతాకాలంలో కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీర ప్రాంతాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి కొల్లేరుకు వలస వస్తాయి. వీటిని చూసేందుకు పర్యాటకులను ఆసక్తి కనబరుస్తారు.. 6లో



మిల్లర్లకు బకాయి

రూ.200 కోట్లు

- మూడేళ్లుగా పెండింగ్
- పట్టించుకోని గత ప్రభుత్వం
- కూటమి రాకతో ఆశలు

అప్పుల పాలైన కార్పొరేషన్

గత ప్రభుత్వంలో పౌరసరఫరాల కార్పొరేషన్ పూర్తిగా అప్పుల పాలైంది. ఒకప్పుడు నిధులు పుష్కలంగా ఉండేవి. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేసేవి. ప్రస్తుతం రేషన్ బియ్యం సరఫరా చేసే కాంట్రాక్టర్‌లకు కూడా సకాలంలో సక్రమంగా బిల్లులు చెల్లించలేని దుస్థితికి కార్పొరేషన్‌కు చేరుకుంది. నిధులు మళ్లించడంతో కార్పొరేషన్‌కు కష్టకాలం ఎదురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దిద్దుబాటు చర్యలు ప్రారంభమయ్యాయి. రైతులకు సకాలంలో సొమ్ములు ఇచ్చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆ హామీని నెరవేరుస్తోంది. రైతులు ధాన్యం విక్రయించే ఇబ్బందులను పరిష్కరించింది. మిలర్లకు కూడా అదే తరహాలో బకాయి లు విడుదల చేస్తే రైతులకు అంతిమంగా మేలు చేకూరనుంది.



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమపై ఆశలు చిగురిస్తున్నాయి. బకాయిలు విడుదల చేస్తారంటూ మిల్లర్లు ఎదురు చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. గత ఆరు సీజన్‌ల నుంచి చార్జీలు చెల్లించలేదు. రైతులకు అదే దుస్థితి ఎదురైంది. సకాలంలో ధాన్యం సొమ్ములు చెల్లించకుండా గత ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. ధాన్యం కొనుగోలుపైనా లెక్కకు మిక్కిలి ఆంక్షలు విధించింది. కూటమి ప్రభుత్వంలో ఒక్కొక్కటి తొలగిస్తున్నారు. రైతులు ధాన్యం అమ్ముకునే విధానాన్ని సులభ తరం చేశారు. అనుకున్నట్టుగానే ధాన్యం అమ్మకాలు సాగించిన 48 గంటల వ్యవధిలో సొమ్ములు జమ చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే జిల్లాలో మసూళ్ల ప్రారంభమయ్యాయి. మరో నెల రోజుల్లో పూర్తి కానున్నాయి. ధాన్యం అమ్మకాలు అంతే వేగంగా జరుగుతున్నాయి, రైతులకు సొమ్ములు జమ అయిపోతున్నాయి. కూటమి ప్రభుత్వంలో రైతు పరిస్థితి బాగుంది. మిల్లును ఎంపిక చేసుకునే హక్కును రైతుకు కల్పించారు. దానివల్ల రైతు ముందుగా సంచులు తెచ్చుకుంటున్నారు. తూకం వేసుకుంటున్నారు. అమ్ముకుంటున్నారు. రోజుల తరబడి రోడ్డుపై ధాన్యం రాశులు పోసి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా పోతోంది. ప్రైవేటుగానూ పోటీ నెలకొంది. వర్తకులు పోటీ పడి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇలా రైతు సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించింది. అదే తరహాలో మిల్లర్లకు బిల్లులు చెల్లించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అదే జరిగితే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రైవేటు వర్తకుల మధ్య పోటీ పెరిగి రైతులకు అధిక ధరలు ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఎప్పుడైతే బిల్లులకు తాత్సారం చేసిందో మిల్లర్లు చేతులెత్తేశారు. కేవలం ప్రభుత్వం కొనుగోళ్లపైనే ఆధారపడుతు న్నారు.

బ్యాంకు గ్యారెంటీల భారం

ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు విడుదల కావడం లేదు. మిల్లింగ్, డ్రయ్యర్, బియ్యం రవాణా, కస్టోడియన్, సంచుల వినియోగ ఛార్జీలను ప్రభుత్వం చెల్లించాలి. జిల్లాలో వైసీపీ హయాంలోనే రూ. 200 కోట్ల మేర బకాయిలున్నాయి. మూడేళ్లగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేసింది. ఫలితంగా బ్యాంకు గ్యారంటీలు చెల్లించడానికి మిల్లర్లు ఇబ్బంది పడుతున్నారు. ఆస్తులు తాకట్టు పెడుతు న్నారు. గ్యారంటీలో 15శాతం సొమ్ము జమ చేస్తున్నారు. బ్యాంకులకు ఒక్క శాతం రుసుము చెల్లిస్తున్నారు. ప్రతి ఏటా బ్యాంకు గ్యారెంటీల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

విదేశీ వర్తకం కనుమరుగు

పశ్చిమగోదావరి నుంచి గతంలో విదేశాలకు బియ్యం ఎగుమతి అయ్యేవి. రబీలో ఉత్పత్తి అయ్యే బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసేవారు. మిల్లర్లు ప్రైవేటుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసుకునేవారు. ప్రభుత్వం నుంచి పోత్సాహకాలు ఉండేవి. క్రమేణా జిల్లాలో బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసే వర్తకులు కనుమరగయ్యారు. మిల్లర్లు సైతం ప్రైవేటుగా బియ్యం అమ్మలేకపోతున్నారు. గిట్టుబాటు కావడంలేదన్న ఉద్దేశంతో వెనుకంజ వేస్తున్నారు. జిల్లానుంచి రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయి. లబ్దిదారుల వద్ద కొనుగోలు చేసి కాకినాడ పోర్టుకు రవాణా చేస్తున్నారు. అక్కడ నుంచి విదేశాలకు తరలిపోతున్నాయి. రేషన్ బియ్యంలో దాదాపు 60శాతం ఇలా విదేశాలకు వెళ్లిపోతున్నాయి. దాంతో మిల్లర్ల నుంచి కొనుగోలు చేయడానికి విదేశీ వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పుడంతా ప్రభుత్వం ధాన్యంకొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగిస్తోంది. తిరిగి బియ్యం తీసుకుంటోంది. అయితే మిల్లర్లకు ఎప్పటికప్పుడు రవాణా చార్జీలు చెల్లించాలి. అది నెరవేర్చడం లేదు. ఎఫ్‌సీఐకి ప్రభుత్వమే బియ్యం అప్పగిస్తుంది. మిల్లర్ల నుంచి బియ్యం సేకరించి ఎఫ్‌సీఐకి తరలిస్తుంది. రవాణా చార్జీలతో సహా బియ్యం బిల్లులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎఫ్‌సిఐ జమ చేస్తోంది. అంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న పౌరసరఫరాల కార్పొరేషన్‌కు జమ అవుతున్నాయి.

భక్తజన సంద్రం.. చినవెంకన్న క్షేత్రం



ద్వారకాతిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమోగింది. కార్తీకమాసంలో రెండో ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. దాదాపు 20వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

పిట్టలను కాల్చే వాడిగా వచ్చి..

బంగారం ఆశ చూపి రూ.20 లక్షలకు టోకరా

మోసపోయిన ఆక్వా రైతు.. పోలీసులకు ఫిర్యాదు

ముదినేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు నికార్సయిన బంగారం ఆభరణాలు ఇస్తామని ఒక వ్యక్తి నుంచి కొందరు వ్యక్తులు రూ.20 లక్షలు కాజేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. నగదు తీసుకుని బంగారం ఇవ్వకపోగా, ఆ వ్యక్తిని భయపెట్టి, దాడికి పాల్పడి ఆ వ్యక్తులు పారిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం చేవూరుపాలెంలో రొయ్యల చెరువు సాగు చేస్తున్న కృష్ణా జిల్లా పెడన మండలం చెన్నూరుకు చెందిన పండ్రాజు రవీంద్ర కుమార్ వద్దకు కొంతకాలం క్రితం మండవల్లి మండలం భైరవపట్నం నుంచి వచ్చానని చెప్పి తమిళనాడుకు చెందిన రాజేంద్ర అనే వ్యక్తి వచ్చాడు. తాను చెరువులపై పిట్టలను కాల్చే వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. గతంలో కాల్వలు తవ్విన సందర్భంగా బయట పడి తమకు దొరికిన బంగారపు ఆభరణాలు ఉన్నాయని, తక్కువ ధరకు ఇస్తానని రవీంద్ర కుమార్‌కు తెలిపారు. అంతేకాక బంగారపు పెద్ద గొలుసు శాంపిల్ చూపించగా, దానిని గతనెల 23న సింగరాయపాలెంలో రవీంద్ర పరీక్ష చేయించగా మంచి బంగారమే అని తేలింది. దీంతో ఆ నగలను తిరిగి తీసుకుని రూ.20 లక్షలకు సరిపడ బంగారపు నగలు ఇస్తానని రాజేంద్ర తెలిపాడు. అతనికి రూ.5 లక్షలు అడ్వాన్సుగా రవీంద్ర ఇచ్చాడు. మిగిలిన రూ.15 లక్షల తెస్తే బంగారు ఆభరణాలు ఇస్తామని తాము గుంటూరు సమీపంలో విజయవాడ - గుంటూరు హైవేలో ఫలానా చోట ఉంటామని రాజేంద్ర తెలిపాడు. ఈక్రమంలో గత నెల 24న అక్కడకు రవీంద్ర వెళ్లగా రాజేంద్రతో పాటు మరో ఇద్దరు వేరే చోటికి తీసుకుళ్లి రూ.15 లక్షలు తీసుకుని బంగారు ఆభరణాలు ఇవ్వకుండా అతన్ని కొట్టి పరారయ్యారు. అప్పటి నుంచి సొమ్ములు కాజేసిన వ్యక్తుల ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఆదివారం రవీంద్ర కుమార్ ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి ఏఎస్ఐ పద్మజ దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా ఫ్రైడే-డ్రైడే

పెరుగుతున్న జ్వర పీడితులు

సంవత్సరం	2022	2023	2024
మలేరియా	0	0	0
డెంగీ	56	36	38
చికున్ గున్యా	0	0	2



అత్తిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం శాపంగా మారింది. దోమల నిర్మూలన, వ్యాధులపై ప్రజలను చైతన్య పరస్తూ ప్రతి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరగాల్సిన ఈ కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. పైగా గ్రామాలు, పట్టణాల్లో అపారిశుధ్యం పెరుగుదల కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. సక్రమంగా చెత్త తీసివేయకపోవడంతో పందుల సంచారం పెరిగిపోతున్నది. పలుచోట్ల డ్రెయినేజీల్లో మురుగు పారడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడాల్సివస్తోంది.

మలేరియా, డెంగీ తదితరాలకు కారణం దోమలు. ప్రజలు మలేరియా బారినపడకుండా ప్రభుత్వాలు ఎంతో ఖర్చు చేస్తున్నాయి. అందుకోసం ప్రత్యేక విభాగం పనిచేస్తుండగా, జిల్లా కేంద్రంలో నివారణాధికారితో పాటు 10 మంది వరకు సిబ్బంది ఉంటారు. వీరితో పాటు పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ-365, ఏఎన్ఎంలు - 618, హెల్త్ అసిస్టెంట్లు - 85, ఆశా- 1391 మంది ఉన్నారు. వీరు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది.

జరగాల్సింది ఇలా ...

దోమల ఉధృతి ప్రదేశాలు, హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి వాటిలో లార్వా వృద్ధి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలి. ఇళ్ళ వాటి పరసరాల్లో నీరు నిల్వ లేకుండా ప్రజలను చైతన్య వంతులను చేయాలి. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలి. మునిసిపాలిటీ, పంచాయతీల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్‌తో పాటు ఆయిల్ బాల్స్ వదలాలి. మలేరియా నియంత్రణలో భాగంగా హెల్త్ అసిస్టెంట్లు ప్రతి ఇంటిని నెలలో రెండుసార్లు సందర్శించి జ్వరపీడితులను గుర్తించి నమూనాలు సేకరించి ప్రభుత్వ మలేరియా నిర్ధారణ ల్యాబ్‌కు పంపాలి. అక్కడ వ్యాధిని గుర్తిస్తే పర్యవేక్షకులు రోగికి చికిత్స అందించాలి. అయితే జ్వరపీడితుల రక్త నమూనాల సేకరణ సక్రమంగా సాగడం లేదు. కొందరు హెల్త్ అసిస్టెంట్లతో మలేరియా సిబ్బంది కుమ్మక్కై నమూనాలు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు చూపెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ చూసినా జ్వర పీడితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతుండడం ఇందుకు నిదర్శనమని అంటున్నారు.





సండే సందడి

కార్తీకమాసం రెండో ఆదివారం పేరుపాలెం బీచ్ సందర్శకులతో నిండిపోయింది. సముద్ర అలల మధ్య సేద తీరారు. బీచ్ వద్ద గుర్రాలపై స్వారీ చేశారు. పలు వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా గడిపారు. తీరం వెంబడి గల ఆలయాలను దర్శించారు. సుమారు 15 వేల మంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్డీవో దాసిరాజు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- మొగల్తూరు



భీమవరం మునిసిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద అధికారులతో ట్రైనీ అధికారులు

యువ ట్రైనీ ఆఫీసర్లకు శిక్షణ

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమవరం మునిసిపాలిటీకి ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌తోపాటు వివిధ సెంట్రల్ సర్వీసెస్‌కు చెందిన వారికి పురపాలన పైన వివిధశాఖల్లో జరిగే కార్యక్రమాలు తదితర అంశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దాదాపు 10 మంది యువ ట్రైనీ ఆఫీసర్లు వచ్చారు. ముందుగా మునిసిపల్ కార్యాయలంలో వివిధ శాఖల అధికారులతో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా మ్యునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పురపాలనకు సంబంధించి అంశాలను వివరించారు. రెవెన్యూ, ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, మెప్మా వంటి శాఖలు సంబంధిత అధికారుల విధులపై వారికి అవగాహన కల్పించారు. ఏడాదికి ఎంత ఆదాయం వస్తుంది. ఎలా నిర్వహణ చేస్తారు, ఎలా బడ్జెట్ కేటాయిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వచ్చే గ్రాంట్స్‌ను ఏవిధంగా వినియోగిస్తారు. పేదలకు ప్రభుత్వం అందించే పథకాలు తదితరవాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనీలు అడిగిన పలు ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులతో వివరణ ఇప్పించారు. మునిసిపల్ కార్యాలయంలోని వివిధ శాఖ విభాగాలను పరిశీలించారు. అక్కడనుంచి వార్డుకు సంబందించి ఉన్న 21వ వార్డు సచివాలయాలను సందర్శించారు. అక్కడ ఏ విధంగా వార్డు ప్ర జల కు అందించే కార్యక్రమాలను, ఉద్యోగుల విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మునిసిపాలిటీకి సంబందించిన హెడ్ వాటర్ వర్క్సును సందర్శించారు. నీటి సరఫరా గురించి ఎంఈ త్రినాథరావు వివరించారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులు వినియోగంపై అవగాహన కల్పించారు. సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ రోగులకు ఎటువంటి వైద్యసేవలు ఎలా అందిస్తారనే దానిపై అవగాహన కల్పించారు. వారంరోజులపాటు వీరు జిల్లాలో పలు అంశాలపై శిక్షణ తీసుకోనున్నారు. వీరికి నోడల్ ఆఫీసర్‌గా ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, యలమంచిలి ఎండీవో ప్రేమాన్విత పర్యవేక్షించారు.

నేడు జడ్పీ సమావేశం రద్దు

ఏలూరుసిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11వ తేదీన జరగాల్సిన జడ్పీ సమావేశం రద్దు చేసినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. జిల్లాలో గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి సమావేశాలు నిర్వహించకూడదని నిబంధనలు ఉండటంతో జడ్పీ ప్రత్యేక సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు జడ్పీ సీఈవో సుబ్బారావు ప్రకటించారు.

మసక మసక.. చీకటిలో..!



- ప్రభుత్వ అతిథి గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలు
- చీకటిపడితే గ్లాసుల గలగల
- ప్రభుత్వం మారినా.. అవే నీచ పనులు

నరసాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ అతిథి గృహం. అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారింది. చీకటి పడితే ఈ అతిథి గృహంలో గ్లాసుల గలగల శబ్దాలు వినిపిస్తాయి. ఇద్దరు ముగ్గురు కలిసి మద్యం సేవించడం, లేదా కొంతమంది కలిసి పార్టీలు చేసుకోవడం సర్వసాధారణమైంది. కొన్ని సమయాల్లో మహిళల్ని తీసుకొచ్చి మరీ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ అతిథి గృహం రోడ్డుపైకి కనిపించదు. పరిసర ప్రాంతాల్లో నివాసాలు లేవు. చీకటి పడితే అంతా నిర్మానుషంగా కనిపిస్తుంది. ఎవరైనా లోపలికి వెళితే తప్ప అతిథి గృహంలో ఉన్నారో లేదో కూడా ఎవరికి తెలియదు. ఈ పరిస్థితులన్నీ అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారికి బాగా కలిసొచ్చాయి. జిల్లాలోనే ఈ అతిథి గృహానికి ఎంతో పేరు ఉన్నది. చాలా పురాతనమైంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులు పర్యటనలకు వచ్చి నప్పుడు ఈ అతిథి గృహంలోనే బస చేస్తారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ అతిథిగృహం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టింది. అధికారం ఉండటంతో కొందరు నాయకులు ఆడింది ఆటా... పాడిందే పాటగా సాగింది. మందు కొట్టాలను కుంటే క్షణాల్లో ఈ అతిథి గృహంలో వాలిపోతారు. ఇక పుట్టిన రోజు పార్టీ లు కూడా ఇక్కడే చేసుకునే వారు. ఇప్పటికి ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఈ అతిథి గృహాన్ని వీడడం లేదు. వారంలో రెండు మూడు రోజులు ఇక్కడే మందు కొట్టి ఎంజాయ్ చేస్తున్నారు.

మరో అతిథి గృహంలోనూ ఇవే పనులు

రెండు పట్టణాలకు మధ్య ఉన్న ఒక స్థానిక సంస్థ అతిథి గృహాన్ని ఈ నీచగాళ్లు విడిచిపెట్టలేదు. పట్టణంలోని అతిథి గృహం ఖాళీ లేనప్పుడాల్లా ఈ స్థానిక సంస్థ అతిథిగృహంలో పార్టీలు చేసుకుంటున్నారు. ఇది పట్టణానికి దూరంగా ఉండటం, నిర్మానుషంగా ఉండటం వంటి అనుకూల పరిస్థితులు వీరికి బాగా కలిసొచ్చాయి.



నిబంధనలు తుంగలో తొక్కి..

ప్రభుత్వం అతిథి గృహాలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మాత్రమే కేటాయించాలి.దీనికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఒక ప్రత్యేక రికార్డు ఉంటుంది. అందులో ఏ రోజు ఎవరు తీసుకున్నారన్న విషయాన్ని విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ శాఖ అధికారులు కాకుండా వేరే శాఖ అధికా రులు లేదా రాష్ట్ర, కేంద్ర స్థాయి అధికారులు విచ్చేసినప్పుడు ముందుగా అతిథిగృహం కావాలని ముఖ్యఅధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి, దీనికి ఎటువంటి సొమ్ము కట్టనవసరం లేదు. ప్రజాప్రతినిధులు వచ్చే సమయంలో ఇదే రూల్ పాటించాలి.ఇక బయట వ్యక్తులకు కావాల్సి వచ్చిప్పుడు ముందుగా బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలి. దీనికి సంబంధించిన అద్దెను చలానా రూపంలో ప్రభుత్వానికి కట్టి అధికారికి అందించాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఈ నిబంధనలు ఎక్కడా పాటించలేదు. ఈకారణంగా వేలకు వేలు కరెంట్ బిల్లును ఈ అతిథి గృహాలు నిర్వహిస్తున్న శాఖలే భరించాల్సి పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా అతిథిగృహాల తాళాలు ఆ శాఖ ముఖ్య అధికారి వద్దే ఉంటాయి. కొన్ని సమయాల్లో వేరే స్థాయి అధికారికి కూడా బాధ్యతలు అప్పగిస్తారు. ఎవరైనా కావాల్సివచ్చినప్పుడు వీరిని సంప్రదించి తాళాలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం డ్యూప్లికేట్ తాళంతో అవసరమైనప్పుడల్లా అతిథి గృహాన్ని వాడే సుకుంటున్నారు. గతంలో ఇదే పట్టణంలోని అతిథిగృహంలో ఇలాంటి సంఘటనలు వెలుగు చూడగా ప్రభుత్వం ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నది.



శ్రీనాథుడు రచించిన భీమేశ్వర పురాణంలో పంచారామాల వృత్తాంతం గురించి ఉన్నట్లు పండితులు చెపుతున్నారు. క్షీరసాగర మధన సమయంలో వెలువడిన అమృతాన్ని మహావిష్ణువు మోహిని రూపం ధరించి సురాసురులకు పంచుతుండగా తమకు అన్యాయం జరిగిందంటూ రాక్షసులు అసంతృప్తి చెందారు. వారు శివుడు కోసం తీవ్ర తపస్సు చేశారు. తారకాసురుడు అనే రాక్షసుడు మహా తపస్సు చేసి తనకు స్త్రీ గర్భము నుంచి పుట్టిన ఎవరి వల్లా మరణం రాకూడదని పరమశివుని వరం పొందుతాడు. శివుడు తన ఆత్మలింగాన్ని ప్రసాదించి వరం అనుగ్రహిస్తాడు. తారకాసురుడు ఆ వర గర్వంతో దేవతలను హింసించడంతో వారంతా మహాదేవుని వేడుకుంటారు. స్త్రీగర్భం నుంచి పుట్టనివారు ఎవరా ఆలోచింపగా కుమారస్వామిని గుర్తించి పరమశివుని ఆదేశానుసారం దేవతల సైన్యానికి అధిపతిగా నియమిస్తారు. కుమారస్వామి తారకాసురుడితో భీకర యుద్ధం చేసి తన పాశుపతంతో వధిస్తాడు. తారకాసురుని మెడలో ఆత్మలింగం ఐదు ఖండాలుగా అవుతుంది. ఈ ఐదు ఖండములు ఐదు క్షేత్రాలలో ప్రతిష్ఠించబడ్డాయి. అందులో ఒకటి అమరావతిలో ఇంద్రుడు ప్రతిష్ఠించగా, రెండో శకలం చంద్రునితో భీమవరం గునుపూడిలో, మూడో శకలం శ్రీరామచంద్రునిచే పాలకొల్లులో, నాల్గవ శకలం కుమారస్వామిచే సామర్లకోటలో ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఐదవ శకలం ద్రాక్షారామంలో ప్రతిష్ఠించేందుకు సప్త మహారుషులు సంకల్పించగా అనుకున్న మూహూర్తానికి కాలయాపన జరగడంతో భీమేశ్వరుడు స్వయంభువుగా వెలసినట్లు తెలుస్తున్నది. అవే పంచారామ క్షేత్రాలుగా విలసిల్లుతున్నాయి.

- భీమవరం టౌన్



ఓం నమో.. శివ రుద్రాయ..

ముక్తిదాయకం.. పంచారామ క్షేత్ర దర్శనం

వర్ణాలు మారే గునుపూడి సోమేశ్వరుడు

చరిత్ర ప్రసిద్ధికెక్కిన అతి ప్రాచీన దేవాలయాలలో గునుపూడి శ్రీసోమేశ్వర జనార్ధనస్వామి ఆలయం ఒకటి. తూర్పుచాళుక్య రాజులలో ప్రసిద్ధుడైన చాళుక్యభీముడు ఈ దేవాలయాన్ని మూడో శతాబ్ధంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. స్థలం పురాణంలో ఈ క్షేత్రాన్ని పరమ పవిత్రక్షేత్రంగా వర్ణించారు. ఈ దేవాలయం గురించి భీమ ఖండం, బ్రహ్మాండ పురాణంలోను పేర్కొన్నారు. చంద్రుడే స్వయంగా ప్రతిష్ఠంచడం వల్ల ఇక్కడి శివలింగం అమావాస్య రోజున గోధుమవర్ణంలోను, పౌర్ణమినాడు శ్వేతవర్ణంలో కనిపిస్తుంది. శివలింగ పైభాగమున అన్నపూర్ణ అమ్మవారి విగ్రహం ఉండటం మరో ప్రత్యేకత. ఈశ్వరుడు గంగను శిరస్సుపై ధరించడానికి ప్రతీకగా ఈ విధంగా నిర్మితమైనదని ప్రజల నమ్మకం. ఈ దేవాలయానికి జనార్ధనస్వామి క్షేత్రపాలకుడు అవడంతో ఇక్కడ వివాహం చేసుకుంటే వైవాహిక జీవితం ఎంతో శుభమయంగా సాగుతుందని నమ్మకం.



యోగ లింగం.. కుమారరామం



సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరాలయం రాష్ట్రంలో ఏకైక యోగలింగంగా, జప, తప, యోగ సాధన చేసే వారికి ప్రశాంతమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. చాణక్య వంశానికి చెందిన భీమమహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.సామర్లకోట కుమారరామ భీమేశ్వర స్వామి, ద్రాక్షరామ భీమేశ్వరాలయం ఈ రెండు ప్రాకారాలు వాస్తురీత్యా ఒకే ఆకారం కలిగి ఉంటాయి. నాలుగు దిక్కులలో నాలుగు గోపుర ద్వారాలు, లోపలి ప్రాకారం సమతలంగాను రెండు భాగములు చేయబడినవి. గుడి చుట్టూ రెండంతస్తులు మండపం ఉంది. ఈ మండపం ఎక్కేందుకు తూర్పుభాగాన మెట్లు, లోపలి మండపం నుంచి కిందికి దిగేందుకు దక్షిణం వైపున విఘ్నేశ్వరుని ఆలయం, సూర్యుని గుడి, తూర్పు వైపున గిరిజా సుందరి ఆలయం ఉన్నవి. లోపలి ప్రాకారం మధ్యలో ఉన్న భీమేశ్వరుని ఆలయం చతురస్రాకారంగా ఉండి రెండు అంతస్తులు కలిగి ఉన్నది. కింది అంతస్తులో ప్రతిష్ఠించిన లింగం పైఅంతస్తు కప్పుగుండాపోయి రెండో అంతస్తులోకి ప్రవేశించి రుద్రభాగం పూజింపబడుతున్నది.





ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం.. ద్రాక్షారామం..



పంచారామాలలో ప్రసిద్ధి గాంచిన ఆరామంగా, త్రి లింగ క్షేత్రాలలో ఒకటిగా, ద్వాదశ జ్యోతిర్లాంగాలలో ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతున్న ప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామం. ఈ క్షేత్రంలో స్వయంభువుడుగా భీమేశ్వర స్వామి, అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తిపీఠంగా మాణిక్యాంబ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ద్రాక్షారామ క్షేత్ర మహాత్యం గురించి వ్యాసుడు తన భీమఖండంలో దక్షారామత్పరం నభూతో నభవిష్యతిగా స్తుతించాడు. కవి సార్వభౌముడు శ్రీనాధుడు ద్రాక్షారామ వంటి క్షేత్రం, భీమేశ్వరుని వంటి దైవం, సప్తగోదావరి వంటి తీర్ధరాజం ఇలలోలేదని పేర్కొన్నాడు. భీమేశ్వరుని ఆలయం క్రీశ 892-922 కాలంలో నిర్మాణం ప్రారంభించినట్లు ఆలయంలో ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తున్నది. చాళుక్యరాజు మొదటి భీమునికాలంలో నిర్మాణం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. కార్తీకమాసంలో సప్తగోదావరిలో పుణ్యస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరునికి సూర్యభగవానుడు తొలి అర్చన చేసినట్లు చెబుతారు.

దేవేంద్రుడు ప్రతిష్ఠించిన అమరేశ్వరస్వామి



అమరావతిలో శివలింగాన్ని దేవతల రాజైన ఇంద్రుడు ప్రతిష్ఠించాడని స్థలపురాణం. తారకాసురుని మెడలోని కుమారస్వామి ఛేదించిన ఆత్మలింగం ఐదు ముక్కలుగా పగిలి ఐదు క్షేత్రాలలో పడింది. అందులో అమరావతిలో పడిన భాగాన్ని దేవతలకు అధిపతి అయిన దేవేంద్రుడు ప్రతిష్ఠించినట్టు స్థల పురాణంలో ఉంది. ఇక్కడ శివలింగం అత్యంత ఎత్తుగా ఉండటంతో అర్చకులు పీఠం ఎక్కి అభిషేకాలు చేస్తూంటారు. ఎత్తు పెరగకుండా ఉండేందు బృహస్పతి ఆదేశాల మేరకు మేకు కొట్టడంతో శివలింగం పైభాగంటో రక్తం మరక ఏర్పడినట్టుగా చెబుతారు ఇప్పటికీ అ మరక కనిపిస్తుంది. ఈ శివలింగాన్ని శ్రీరామ చంద్రుడు చేత పూజించబడిందని చెబుతారు. అమరుల నివాసంగా మారిన ప్రాంతంగా అమరావతి అనే పేరు వచ్చిందని పురణాకథనం.. బాలచాముండికా సమేతుడైన అమరేశ్వరస్వామి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. పంచారామాలను కార్తీకమాసంలో ఒకేరోజు దర్శించిన భక్తులకు కోరికలు తీరడంతో పాటు మోక్షం కలుగుతుంది.



ఒకే రోజు ఐదు క్షేత్రాల దర్శనం

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలన్నిటినీ ఒకేరోజు దర్శించుకునే విధంగా ఆర్టీసీ అధికారులు పంచారామ దర్శిని పేరిట బస్సులు నడుపుతున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సంబంధిత దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో మాట్లాడి పంచారామ భక్తులకు త్వరిత గతిని దర్శనం చేయించే విధంగా ప్రతీ దేవాలయం వద్ద ఆర్టీసీ ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ విధానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. సంబంధిత డిపో మేనేజర్లను సంప్రదిస్తే వివరాలు తెలుస్తాయి టికెట్ ధర ఇలా ఉంది. పల్లెవెలుగుకు 720, ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్‌కు రూ 1100. సూపర్ లగ్జరీకి రూ.1200 నిర్ణయించారు. సోమవారం భక్తులకు దర్శనాలు కల్పించేందుకు 17 బస్సులను నడుపుతోంది. భీమవరం డిపో నుంచి 6, నరసాపురం నుంచి 3, తణుకు నుంచి 4, తాడేపల్లిగూడెం నుంచి 4 బస్సులను నడుపుతున్నారు. ఆదివారం రాత్రి 9-30 నిమిషాలకు భక్తులను ఎక్కించుకుని బయలుదేరాయి. తిరిగి సోమవారం రాత్రికి ఆయా డిపోలకు చేరుకుంటాయి.


వివిధ డిపో మేనేజర్ల ఫోన్ నంబర్లు ఇవీ..

ఏలూరు డిపో మేనేజర్	99592 25487
భీమవరం డిపో మేనేజర్	99592 25485
నర్సాపురం డిపో మేనేజర్	99592 25486
తణుకు డిపో మేనేజర్	99592 25484
జంగారెడ్డిగూడెం	99592 25489
తాడేపల్లిగూడెం	99592 25488
కొవ్వూరు డిపో	91009 54631
నిడదవోలు డిపో మేనేజర్	94911 88236

విష్ణుమూర్తి ప్రతిష్ఠించిన క్షీరారాముడు..



క్షీరపురి (పాలకొల్లు)లో పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి కొలువుతీరి ఉన్నారు. స్కాంధపురాణ ఆధారంగా ఆలయ చరిత్ర గురించి తెలుస్తున్నది.తారకాసురుడిని వధించడానికి శివుని కుమారుడు కుమారస్వామి భీకర యుద్ధం చేసి తారాకాసురుడి దేహంలో ఉన్న అమృతలింగం ఖండించాడు. అందులో శిరోభాగం క్షీరపురి క్షేత్రంలో పడటంతో శ్రీమహావిష్ణువు ఆ ఖండభాగాన్ని ప్రతిష్ఠించినట్టు తెలుస్తున్నది. 918 ప్రాంతంలో మొదటి చాణిక్య భీముడు ఇక్కడ ఆలయ నిర్మాణం చేపట్టినట్టు చరిత్ర ఆధారంగా తెలస్తున్నది. అనంతరం శాతవాహనులు, ఇక్ష్వాకులు, తూర్పు చాణుక్యుల పాలనలో ఆలయం అభివృద్ధి చెందింది. దీంతో పాటు 120 అడుగుల ఎత్తున తొమ్మిది అంతస్తులలో గాలిగోపురం నిర్మించి పైభాగంలో శిఖరాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో పంచగణపతులు, శివ పంచాయతన దేవాలయం, పంచ లింగాలు, పంచ దేవేర్లు, పంచ మండపాలు, పంచ ద్వారాలు, పంచ నందులు, పంచ శిఖరాలు ఉండటం విశేషం. ఇక్కడి శివలింగం తెల్లని పాలరంగులో ఉంటుంది.. క్షీరారామంలో ఒక రోజు బస చేస్తే ఒక ఏడాది ఉన్నట్లేనని నమ్మకం..





పంచ శివాలయాల బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

బైక్ ర్యాలీగా పంచ శివాలయాల దర్శనం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షీరారామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పంచ (5) శివాలయాల దర్శనం పేరుతో చేపట్టిన బైక్ ర్యాలీని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు జెండా ఊపి ప్రారంభించారు.నిమ్మల మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి దర్శనం అనంతరం పూలపల్లిలోని మరకత లింగం ఆలయంలో స్వామిని దర్శించుకుంటారు. వీరవాసరంలోని వీరేశ్వర విశ్వేశ్వరస్వామి దర్శనం అనంతరం భీమవరంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి గునుపూడి సోమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం యన మదుర్రు శక్తీశ్వరస్వామి దర్శనం అనంతరం అక్కడే ప్రసాదం తీసుకుని ర్యాలీ ముగిస్తారు. సేవా సమితి అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ, సభ్యులు జక్కంపూడి కుమార్, ధనాని ప్రకాశ్, కొప్పుల శ్రీను, సీహెచ్ శ్రీనివాస్, మహిళలు, అయ్యప్ప, శివమాల ధారులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన విశాఖపట్నం బాలికల.. బాలుర జట్లు

స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ విజేత విశాఖ

పెదవేగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో రెండురోజుల పాటు జరిగిన 19 ఏళ్ళ విభాగం రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జట్లు ప్రతిభతో ప్రథమస్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో విశాఖజట్టు ప్రథమస్థానం సాధించగా, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లా జట్లు ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో విశాఖజట్టు ప్రథమ స్థానంలో నిలవగా అనంతపురం, ప్రకాశం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు పీడీలు సుబ్బారావు, ధనలక్ష్మి, గురుమూర్తి,13 జిల్లాలకు చెందిన పీడీలు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి రాయల్ క్లబ్ ఆర్థిక సాయం

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడికి చెందిన క్రీడాకారిణి వి.భార్గవికి రాయల్ క్లబ్ సభ్యులు రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. భార్గవి జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో జావలెన్ త్రోలో పాల్గొనడానికి ఎంపికైంది. ఈమె గతంలో జావలెన్‌త్రో, షాట్‌పుట్ రెండింటిలోను బంగారు పతకాలు, అంతర్ జిల్లాల పోటీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. జాతీయ పోటీలకు ఎంపికవడంతో రాంచీ వెళ్ళడానికి ఖర్చుల కోసం రాయల్ క్లబ్ ఆమెకు ఈ సహాయం అందజేసింది. సభ్యులు చిక్కాల నాగేశ్వరరావు, కొండపల్లి శేషగిరిరావు, గందం రామ్మోహన్‌రావు, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

కొల్లేరుకు విదేశీ చుట్టాలు



కైకలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సుకు విదేశీపక్షులు రాక మొదలైంది. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి చేరుతుంటాయి. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి శీతాకాలపు అతిధులుగా వచ్చి పర్యాటకులను ఆకర్షిస్తాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని తీసుకుంటాయి. సమీప ప్రాంతాల నుంచి పుల్లలు తెచ్చుకుని గూళ్లు కట్టుకుంటాయి. పెయింటెడ్ స్టార్క్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి కోసం కొల్లేరుకు వస్తుంటాయి.

పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ళ కొంగ)

పెయింటెడ్ స్టార్క్ పక్షి ఒంటిపై ముద్దులొలికే రంగులు ఉంటాయి. గులాబి, నలుపు రంగులు పెయింటింగ్ వేసినట్లు కనిపిస్తాయి. కాళ్లు, ముక్కు ఎర్రగా ఉంటాయి. ఈపక్షి పిల్ల దశలో పూర్తిగా నలుపు రంగులో కనిపిస్తుంది. వయసు పెరిగే కొద్దీ రంగులద్దుకుంటుంది. ముళ్ళు ఉన్న చెట్లపై ఎక్కువగా గూడు ఏర్పాటు చేసుకుంటాయి. ఉత్తరభారతదేశం నుంచి శీతాకాలం ప్రారంభమైన తరువాతనే దక్షిణాది ప్రాంతాలకు వలసలు వస్తాయి. వీటి రంగులు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



ఐరన్ స్టాండ్‌లపై నివాసం



పెలికాన్ (గూడబాతు)



పెలికాన్ పక్షి కొల్లేరు సరస్సులో రారాజులా కనిపిస్తూంటాయి. అక్టోబర్ నుంచి మార్చినెలల మధ్యకాలంలో ఈ జాతిపక్షులు కొల్లేరుకువచ్చి గుడ్లుపెట్టి పొదుగుతుంటాయి. ఆడపక్షి గుబురుగా ఉండే చెట్ల పొదల్లో, అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన కృత్రిమ ఇనుపస్టాండ్లపై గుడ్లు పెట్టి పొదుగుతుండగా మగపక్షి సరస్సులో సంచరించి ఆహారాన్ని తీసుకువస్తూ ఉంటుంది. సుమారు 2 నుంచి 6 కేజీల బరువు ఉండే ఈ పక్షి గోధుమ వర్ణంలో ఉండి పొడవైన ముక్కు, దానికింద సంచి వంటి భాగం ఉండి అరకిలో నుండి కేజీ బరువు గల చేపను గుటుక్కున మింగేస్తుంది. ప్రతి సంవత్సరం వేలాది పెలికాన్స్ తరలిరావడంతో అధికారులు ఆటపాక పక్షుల కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా పేరు పెట్టారు.

ద్వారకా తిరుమల కొండపై ట్రాఫిక్ సమస్య

వేరే రోడ్డుకు మళ్లించడంతో భక్తులకు ఇబ్బందులు

ద్వారకాతిరుమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయానికి వాహనాలపై వచ్చిన భక్తులు దేవాలయ అధికారుల అనాలోచిత నిర్ణయానికి ఆదివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయానికి ప్రతీ శని, ఆదివారాల్లో వేలాది సంఖ్యలో యాత్రికులు, వందల సంఖ్యలో కార్లు వస్తుంటాయి. అయితే ఆదివారం శ్రీవారి ఘాట్ రోడ్డు నుంచి ఆలయానికి పైకి వెళ్లిన వాహనాలను సెంట్రల్ పార్కింగ్‌లో ఉంచి దర్శనానంతరం శివాలయ వద్దనున్న దిగువ రోడ్డు మీదుగా కిందకు దిగాలని అధికారులు నిర్ణయించారు. ఈ విధంగా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. దీంతో వాహనంలో వచ్చి మొక్కు బడులు తీర్చుకోవాలనుకున్న వృద్ధులు, మహిళలు రోడ్డుకు అటువైపు ఉన్న కేశఖండన శాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.వారు చుట్టు తిరిగి రావాల్సి వచ్చింది. ఇప్పటివరకూ దర్శనానికి కార్లలో వచ్చేవారు ఘాట్ రోడ్డు గుండా టోల్‌గేట్ మీదుగా పైకి వచ్చి సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలను ఉంచేవారు. తర్వాత పక్క రోడ్డు గుండా కిందకు వెళ్లేవారు. అదే మొక్కులు తీర్చుకునే పెద్దవారయితే సెంట్రల్ పార్కింగ్ టర్నింగ్ తీసుకుని కేశఖండనశాల వద్ద దిగేవారు. ఇది వారికి కాస్త సులువుగా ఉండేది. కానీ ఇప్పుడు రూటు మార్చడంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో భక్తులు గొడవ చేయడంతో సాయంత్రానికి అధికారులు యధావిధిగా మార్పు చేశారు. గతంలో ఆశ్రం వద్ద నున్న గేటు నుంచి వాహనాలు రాకపోకలు సాగించేవి. ఘాట్ రోడ్డు నిర్మించిన వాడుకలోకి వచ్చిన కారణంతో ఆ గేటును కొన్నాళ్లుగా మూసి వేశారు. ప్రస్తుతం ఆగేటు నుంచి పాదచారులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు. ఆ గేటు కూడా తెరిస్తే బావుంటుందని స్థానికులు అంటున్నారు.



మూసి వేసిన పాత గేటు



సెంట్రల్ పార్కింగ్ ముందు అడ్డదిడ్డంగా వాహనాలు



శివాలయం వద్ద ట్రాఫిక్ మళ్లించిన రోడ్డు ఇదే..



ఘాట్‌రోడ్డు మీదుగా సెంట్రల్ పార్కింగ్‌కు వెళ్తున్న భక్తుల వాహనాలు

గురుబ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వర :
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురవే నమః



మారుతున్న గురుస్థానం

నేటి విద్యావ్యవస్థలో పెనుమార్పులు

» కొన్ని విధానాలతో విద్యావ్యవస్థ బలోపేతం.. మరికొన్నింటితో విద్యార్థులు పక్కదోవ

నేడు జాతీయ విద్యా దినోత్సవం

గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పోలుస్తూ గురువుకు అత్యున్నత స్థానం ఇచ్చేవారు. తల్లి, తండ్రి తర్వాత గురువుకే ప్రాధాన్యత ఇచ్చేవారు. ఒకప్పుడు రాకుమారుడైనా విద్య నేర్చుకోవడానికి గురువు ఆశ్రంలో గురువుకు సర్వ సపర్యలు చేస్తూ విద్యను అభ్యసించేవారు. నేడు మారుతున్న కాలంలో గురుస్థానం కూడా మారుతోంది. ఆశ్రమాల స్థానంలో ఏర్పడిన విద్యాపీఠాలు, తర్వాత పాఠశాలలు, కళాశాలలు, అకాడమీలు రూపాంతరం చెంది నేటి విద్యావవస్థలో పెనుమార్పులు సంభవించాయి. ఆధునిక టెక్నాలజీ వల్ల విద్యాబోధనలో ఎన్నో మార్పులు చోటుచేసు కుంటున్నాయి. కొన్ని మార్పులు విద్యావ్యవస్థను బలోపేతం చేస్తుండగా.. మరికొన్ని విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నాయి. మన దేశ తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని నవంబరు 11వ తేదీన జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నిడమర్రు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :

గురు ఆశ్రమాల నాటి విద్యావ్యవస్థ..

గురుఆశ్రమాలలో విద్యార్థులందరూ అడవులలో వనవాసంగా ఉంటూ విద్య నేర్చుకునేవారు. గురువులు వారికి విద్యాబోధన చేస్తూ నైతికవిలువలు బోధించేవారు. వేద విద్య, వేద గణితం, శాస్త్రీయ దృక్పథంతో కూడిన విద్య, యుద్ధవిద్యను బోధించేవారు.

బ్రిటీష్ విద్యావిధానంతో మార్పులు..

1835లో బ్రిటీష్ గవర్నర్ జనరల్ విలియం బెంటిక్ ఉన్న కాలంలో లార్డ్ మెకాలే భారతదేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేశాడు. భారతీయ విద్యాబోధనలో ఆంగ్లాన్ని ప్రవేశపెట్టి భారతీయ విద్యార్థులకు ఆంగ్ల భాషను నేర్పించడం మొదలుపెట్టారు. తద్వారా భారతీయ విద్యార్థులు ఆంగ్ల భాషపై మంచి పట్టుసాధించి విదేశీ విద్యను అభ్యసించి ప్రపంచ పరిజ్ఞానం పెంచుకుని మేధావులుగా తీర్చిదిద్దబడి దేశానికి, ప్రపంచానికి అత్యున్నత సేవలు అందించారు.

స్వతంత్ర భారతంలో విద్యావ్యవస్థ..

భారతదేశం 1947లో స్వాతంత్ర్యం అనంతరం తొలి విద్యాశాఖ మంత్రి మలౌనా అబుల్ కలాం ఆజాద్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. విద్యావిధానం అభివృద్ధికి కృషి చేశారు. 1967లో కొఠారి కమిషన్ ద్వారా దేశంలో తొలిసారి 10+2+3 విద్యావిధానం ప్రవేశ పెట్టారు. 2000లో జాతీయ విద్యావిధానంలో సమగ్రశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలలకు కావల్సిన వసతులు కల్పనతో పాటు సీసీఈ విధానంలో అంటే నిరంతర సమగ్ర మూల్యాంకనం జరుగుతుంది.

ఎటువంటి విద్య కావాలంటే..

నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే ప్రకారం మన రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు 80శాతం అయినప్పటికీ, వారికి సామర్థ్యం 20శాతం కూడా ఉండడం లేదు. మన రాష్ట్రం లోనే కాదు దేశంలో ప్రతి ఏడాది 15 లక్షల మంది ఇంజనీర్లు విద్యాసంస్థల నుంచి పట్టభద్రులై వస్తున్నారు. వారిలో 15శాతం మాత్రమే ప్రస్తుత ప్రపంచానికి తగిన నైపుణ్యాలను కలిగి ఉండడం దురదృష్టకరం. మారుతున్న సమాజానికి పనికొచ్చే అసలు సిసలైన విద్య మన విద్యార్థులకు కావాలి.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యా సమాచారం

ఏలూరు జిల్లాలో (ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలు)

మండలాలు సంఖ్య 27.
పాఠశాల సంఖ్య : 2,364
ఉపాధ్యాయుల సంఖ్య : 11,450
విద్యార్థుల సంఖ్య : ప్రాథమిక : 1,21,540, ప్రాథమికోన్నత 84,190, ఉన్నత పాఠశాలల్లో : 52,239 మొత్తం : 2,57,969.

పశ్చిమ గోదావరి జిల్లాలో (ప్రభుత్వ/ప్రైవేట్ స్కూల్స్)

మండలాల సంఖ్య : 20
పాఠశాలలసంఖ్య : 1,942
ఉపాధ్యాయుల సంఖ్య : 9,400
విద్యార్థుల సంఖ్య : ప్రాథమిక 1,11,798, ప్రాథమికోన్నత 78,984, ఉన్నత పాఠశాలల్లో 49,259 మొత్తం : 2,40,041

ఉపాధి, నైపుణ్యాలను పెంచని చదువు..

నైపుణ్యాలను పెంచని చదువు... ఉత్పాదకతను ఇవ్వని చదువు వల్ల ప్రయోజనం ఏమిటి ? ప్రస్తుత విద్యా విధానం ఎలా ఉందంటే ఎడ్యుకేషన్ సిస్టం అంటే ఎగ్జామినేషన్ సిస్టమ్‌గా ఉంది. నేటి కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలంలో తల్లిదండ్రులు కూడా పడి తమ పిల్లలను బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. విద్యాలయాలు అంటే విద్యకు మాత్రమే నిలయాలు కాదు. విద్యాలయాలు ఆనందాల నిలయాలు. ప్రతి విద్యార్థిని సమర్థుడిగా తీర్చిదిద్దేట్లు మన విద్యావ్యవస్థ ఉండాలి.

విద్యావ్యవస్థలో సంస్కరణలు ఇలా..

- విద్యార్థుల వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఉండాలి.
- మానసిక, శారీరక ఆరోగ్యం పట్ల ఆవగాహన. ప్రతి రోజూ వ్యాయామం పాఠశాల విద్యలో ఉండి అమలు జరగాలి.
- సామాజిక బాధ్యతను తెలియజేస్తూ, సార్వత్రిక అవగాహన కల్పిస్తూ, ఆధునిక టెక్నాలజీ పట్ల అవగాహనతో కూడిన విద్యను అందివ్వాలి.
- సమగ్ర శిక్షణకు వేదికగా, నైపుణ్య ఆధారిత విద్యకు మూలంగా, పరిశోధనకు కేంద్రంగా విద్యావిధానం ఉండాలని విద్యావేత్తలు కోరుతున్నారు.
- ప్రతి విద్యార్థి అమూల్యమనే అనే భావనతో విద్యాబోధన జరిగినప్పుడే సంపూర్ణ విద్య భావన విజయవంతమవుతుంది.

యాప్‌ల భారం తగ్గించాలి



ఉపాధ్యాయులకు విద్యాబోధన సమయం పూర్తిగా సన్నగిల్లుతోంది. పాఠశాల విద్య ప్రవేశపెట్టే నూతన విద్యాప్రయోగాలు వల్ల ఉపాధ్యాయుడి విలువైన విద్యాబోధనా సమయం పూర్తిగా హరిస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న యాప్‌ల వల్ల 40కు పైగా అంశాలులో ఉపాధ్యాయుడు సమాచారం ఆన్‌లైన్‌లో పూరించాలి. ఉపాధ్యాయుడికి విద్యాబోధన సమయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయి.

– డి. జోగినాయుడు
టీచర్, ఉంగుటూరు మండలం

గురుస్థానానికి ప్రత్యామ్నాయం.. టెక్నాలజీ కాదు.



నేటి విద్యావిధానంలో అనూహ్య మార్పులు చోటుచేసుకొంటున్నాయి. ఉపాధ్యాయుడు స్థానంలో వర్చువల్ బోధన, ఆన్‌లైన్ బోధనకు ప్రాధాన్యం ఉంటోంది. టెక్నాలజీ పేరుతో ఉపాధ్యాయుడుకి ప్రత్యామ్నాయం చూపుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సహకారంతో టీచర్లను ప్రవేశపెట్టడానికి కొన్ని ఉన్నత విద్యాసంస్థలు ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల విజ్ఞానం, నైపుణ్యం వస్తుందేమో కానీ మానవతా విలువలు, దేశభక్తి, నైతిక విలువలు కోల్పోవలసి వస్తుంది.

– ముత్యాల కళ్యాణ్
ప్రిన్స్‌పాల్
వైఎస్. ఉపాధ్యా య శిక్షణ కళాశాల, నరసాపురం

చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ వహించాలి



మాది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. మా కష్టార్జితం అంతా పిల్లల భవిష్యత్తు కోసం వెచ్చిస్తున్నాం. నేటి ఆధునిక కాలంలో నైపుణ్యం పెంపుపై గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. స్కూల్స్‌లో పూర్తిస్థాయిలో టీచర్లను నియమించినపుడే చక్కటి విద్య అందించబడుతుంది. పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత తగ్గుతోంది. దీని కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నడింపల్లి దేవి, విద్యాకమిటీ చైర్మన్, ఉన్నత పాఠశాల, ఫత్తేపురం

కొత్తగా మరికొందరికి ఉత్తమ పురస్కారాలు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ఇప్పటికే కొంతమంది ఎంపిక కాగా తాజాగా ఇంటర్, సాంకేతిక, ఉన్నత విద్య శాఖల నుంచి ఉత్తమ అధ్యాపక పురస్కారాలకు ఎంపికైనవారి జాబితాలను తాజాగా విడుదల చేశారు. ఆ ప్రకారం ఇంటర్ విద్యలో నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ జూనియర్ లెక్చరర్ సీహెచ్.వి.వి.రామచంద్రరావు, తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ పి.వి.నాగార్జున ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. సాంకేతిక విద్యలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్ లెక్చరర్ డి.శ్రీకాంత్, ఉన్నత విద్యలో యూనివర్సిటీ లెక్చరర్స్ విభాగం నుంచి వెంకటరామన్న గూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెజిటబుల్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ సయ్యద్ సదరున్నీసా ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు.

ఉభయ గోదావరి జిల్లాల 'ఉత్తములకు' పురస్కారాల అందజేత వాయిదా

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించే జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పురస్కారాలను అందించాల్సి ఉంది. అయితే ఉభయ గోదావరి జిల్లాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన 27 మందికి (పాఠశాల విద్య నుంచి 14 మంది, ఇంటర్, సాంకేతిక, ఉన్నత విద్యాశాఖల నుంచి 13 మంది) సోమవారం అవార్డులివ్వడం లేదని, తిరిగి ఈ పురస్కారాలను ఎప్పుడు ఇచ్చేదీ అధికారికంగా ఇంకా ప్రకటించాల్సి ఉందని ఏలూరు జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం ధ్రువీకరించారు. కాగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం తమ జీవితంలో మరుపురాని క్షణమని, ఈ ఏడాది ఈ గౌరవం దక్కే అవకాశం లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని అవార్డులకు ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు వ్యాఖ్యానించారు. సీఎం, విద్యాశాఖ మంత్రితోనే మరోరోజు కార్యక్రమాన్ని నిర్వహించాలని వారు అభ్యర్థిస్తున్నారు.

జేఎన్వీలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

పెదవేగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9,11వ తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి నవోదయ విద్యాలయ సమితి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. పరీక్షకు దరఖాస్తు చేయడానికి ఈనెల 19వ తేదీ వరకు గడువును పొడిగించిందన్నారు. దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి ఈనెల 20,21 తేదీల వరకు అవకాశం కల్పించారన్నారు. అభ్యర్థులు 9వ తరగతిలో ప్రవేశానికి https:// cbseitms. nic.in/ 2024/nvsix/, 11వ తరగతిలో ప్రవేశానికి https://cbseitms. nic.in/ 2024/nvsxi/ వెబ్‌సైట్‌ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.



అండర్-19 బాలుర విభాగంలో ప్రథమ స్థానం పొందిన పశ్చిమ జిల్లా జట్టు

అండర్-19 టెన్నికాయిట్ బాలుర విజేత 'పశ్చిమ'

ముగిసిన 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ పోటీలు

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో ఈనెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ హైస్కూలులో జరిగిన రాష్ట్ర 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికలు 390 మంది పాల్గొన్నారు. 78 జట్లు లీగ్ నాకౌట్ పద్ధతిలో పోటీ పడ్డాయి. దీనిలో అండర్-19 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పు గోదావరి ద్వితీయ, చిత్తూరు తృతీయ స్థానాలు పొందాయి. అండర్-17 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పుగోదావరి ద్వితీయ, పశ్చిమ తృతీయ స్థానాలు పొందాయి. అండర్-14 బాలికల విభాగంలో పశ్చిమ ప్రథమం, విజయనగరం ద్వితీయ, అనంతపురం తృతీయ స్థానాలు పొందాయి.

బాలుర విభాగంలో.. అండర్-19లో పశ్చిమ జిల్లా జట్టు ప్రథమ, విజయనగరం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ, అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ తూర్పుగోదావరి, ద్వితీయ విశాఖ పట్టణం, తృతీయ అనంతపురం సాధించాయి. అండర్-14 బాలుర విభాగంలో అనంతపురం ప్రథమ, పశ్చిమ ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ స్థానాలు సాధించాయి. ముగింపు సభలో పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే క్రీడాకారులు మరింత స్థాయికి ఎదుగుతారని, క్రీడారంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విజేతలకు మాజీ స్పోర్ట్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పేరం రవీంద్రనాథ్, పోటీల పరిశీలకులు ఎన్.టి. ప్రసాద్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, కె.రమేష్, కె.సురేష్‌కు మార్, హెచ్‌ఎం పి.సుధాక రరావు, పిట్టా వేణు, మాటూరి చక్రధరరావు, అల్లూరి గిరిరాజు తదితరుల చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేశారు. మండలంలోని పీడీలు, పీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు.. నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

» ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.. » కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్ » అభ్యర్థితోపాటు ఐదుగురికే అనుమతి
» నేడు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్న కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుంది. కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో ఈ మేరకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కలెక్టరేట్ ప్రాంగణంలోకి మూడు కార్లకు అనుమతి ఇస్తారు. కోర్టుహాలులో నామినేషన్ సమర్పించేందుకు అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఇస్తారు. అభ్యర్థులకు ఉండే సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేస్తారు. నామినేషన్ల పరిశీలనకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించారు. ఈనెల 18వతేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. డిసెంబరు 5న పోలింగ్, డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

మొత్తం ఓటర్లు 16,316 మంది

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 16,316మంది ఉన్నారు. మొత్తంగా 116 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ఆరు జిల్లాల నుంచి కాకినాడకే కావాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాలి. దీనిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి.

ఎమ్మెల్సీ మృతి చెందడంతో ఉప ఎన్నిక

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబరు 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఈ ఉపఎన్నిక జరుగుతుంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027, మార్చి 29వతేదీ వరకు ఉంది. రోడ్డుప్రమాదంలో మృతిచెందడంవల్ల ఉపఎన్నిక అనివార్యమైంది.



దుకాణంలో చెలరేగిన మంటలు

హోమ్ నీడ్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం

ఏలూరు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వన్‌టౌన్‌లోని బటర్‌పై హోమ్ నీడ్స్ దుకాణంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపుచేశారు. ఈలోపు సుమారు రూ. 3 లక్షల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.



అగ్నికి ఆహుతైన వస్తువులు

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ ముఠామేస్త్రి మృతి

టి.నరసాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై కలుపుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టి.నరసాపురం మండలం వల్లంపట్ల గ్రామంలో జరిగింది. హెచ్‌సీ కె. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన చవల వెంకటదుర్గారావు(35) బస్ డిపోలో ముఠా మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతడికి 15 ఏళ్ల క్రితం కనకదుర్గతో వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతడు ఇటీవల గ్రామంలో కౌలుకు తీసుకున్న జీడితోటకు కొట్టగా మిగిలిన కలుపుమందు పొలాల్లో కలుపుకుని ఈనెల ఒకటిన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని స్థానికంగా వైద్యం చేయించి ఆ తరువాత జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు మృతుడి భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

ఒంటరి జీవితంపై విరక్తితో..

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తూ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన పెదపాడు మండలం కొత్తూరులో ఆదివారం జరిగింది. పెదపాడు ఎస్‌ఐ కట్టా శారద సతీష్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన దంపనబోయిన శ్రీరంగం (40) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య 15 ఏళ్ల క్రితం మృతి చెందగా తండ్రి గతంలోనే చనిపోయాడు. తల్లి ఐదు నెలల క్రితం చనిపోయింది. ఈక్రమంలో శ్రీరంగం మూలలంకలో ఉంటున్న చెల్లెలు కృష్ణకుమారి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల పెన్షన్ తీసుకునేందుకు గ్రామానికి వచ్చి పెన్షన్ తీసుకున్న అనంతరం ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఆదివారం ఉదయం ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం.. ఇద్దరికి గాయాలు

ద్వారకాతిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల లోని తూర్పు వీధిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన ఉప్పల కిషోర్, జస్వంత్ అనే ఆరేళ్ల బాలుడిపై దాడి చేసి గాయపరిచింది. స్థానికులు దానిని వెంబడించేసరికి అది పారిపోయింది. బాధితులను స్థానిక పీహెచ్‌సికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో ఇటీవల కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.



జస్వంత్ కాలుపై కుక్క కరిచిన దృశ్యం

మహిళపై దౌర్జన్యం.. ఇద్దరిపై కేసు

ఉండి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివాహిత మహిళపై దౌర్జన్యం చేసిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు ఆదివారం తెలిపారు. ఉండి ఎస్‌ఐ నజీరుల్లా తెలిపిన వివరాలివి.. ఉండి గ్రామం రామాపురానికి చెందిన పూసలపాటి శాంతకుమారిపై అదే గ్రామానికి చెందిన దువ్వి సూరిబాబు అతడి భార్య జ్యోతి ఈనెల 8వ తేదీ రాత్రి ఇంటికి వెళ్లి ఆమెపై దౌర్జన్యం చేశారు. స్పందనలో తమపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఆమెను చేతులతో కొట్టినట్టు బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేలపై దాడులు

వేర్వేరు చోట్ల మొత్తం 9 మంది అరెస్ట్

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేర్వేరుచోట్ల కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసి మొత్తం తొమ్మిది మంది అరెస్ట్ చేశారు. ద్వారకా తిరుమల మండలంలోని కోడిగూడెంలో ద్వారకాతిరుమల పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2100 నగదు, రెండు కోడి కత్తులు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చల్లావారిగూడెంలో

జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడికత్తి, ఒక కోడి పుంజు, రూ.1230 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని హెచ్‌సి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఫిర్యాదు చేశానని దాడి



చికిత్స పొందుతున్న బాధితుడు బాలకోటయ్య

నూజివీడు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణం స్టేషన్ కోట ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల్లో సారా విక్రయాలు కొనసాగించడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడంటూ ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలివి.. స్టేషన్‌తోటకు చెందిన బాధితుడు బాలకోటయ్య తమ ఇంటి నివాస ప్రాంతాల్లో సారా అమ్మకాలను ప్రశ్నించి పోలీసులకు ఫిర్యాదు చేయగా సారా విక్రేతలు ఐదుగురు తనపై కర్రలతో దాడి చేసినట్లు వాపోయాడు. నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులను అదుపులోకి తీసుకుని తనకు రక్షణ కల్పించాలని బాధితుడు కోరుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బెల్టు షాపుపై దాడి.. ఒకరి అరెస్ట్

నూజివీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి మద్యాన్ని విక్రయిస్తే సంబంధిత లిక్కర్ షాపులపై చర్యలు చేపడ తామని నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన దొండపాటి ఆంజనేయులును బెల్టు షాపు నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వారంతా 50 ఏళ్ల క్రితం కలిసి స్నేహం ప్రారంభించారు. నాటి స్మృతులను నెమరువేసుకుని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1974లో ఎనిమిదో తరగతి చదివిన స్నేహితులు 1979లో పదో తరగతి పూర్తిచేసి పలు వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వారంతా వృత్తులు. ఉద్యోగాలకు విరమణ చేసే వయస్సులో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుల నాటి సంగతులు గుర్తుచేసుకున్నారు. సంతోషంగా ఆటపాటలతో గడిపారు. పూర్వ విద్యార్థులు పరిమి రామచంద్రరావు, పొలమోలు విజయ భాస్కరరావు, వీవీ దొరయ్య తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



వేర్వేరు చోట్ల పది మంది జూదరుల అరెస్ట్

లింగపాలెం/పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల పది మంది జూదరులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. లింగపాలెం మండలం బాధరాలలో పేకాట స్థావరంపై దాడి చేశామని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వెంకటాపురంలో..

పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ వెంకటాపురంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామని పెదపాడు ఎస్‌ఐ కట్టా శారద సతీష్ తెలిపారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

13న విజయవాడకు రవిశంకర్ గురూజీ రాక

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ గురూజీ విజయవాడ వస్తున్న సందర్భంగా భీమవరం భీమేశ్వర స్వామి ఆలయంలో పతంజలి యోగ గురువు కలిగొట్ల గోపాలశర్మ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. రవిశంకర్ గురూజీ లక్షమంది శిష్యులతో యోగా నిర్వహించి దివ్య సందేశం ఇస్తారని, అందరూ పాల్గొనాలని, ఆ రోజు సాయంత్రం 6 గంటలకు భవానీపురం పున్నమి ఘాట్ కార్యక్రమం జరుగుతుందన్నారు. చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేసిన ఆంగ్లేయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని, తొలి తెలుగు శబ్దకోశమును ఈయనే ప్రచురించాడని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాడు ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో బ్రౌన్ జయంతిని నిర్వహించారు. తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ, చెరుకువాడ రంగసాయి, డి. రామ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చెయ్యాలి

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధిస్తూ, గుడ్డ సంచులు ఉపయోగించాలని భీమవరం వన్ టౌన్ ఎస్ఐ కృష్ణాజీ పిలుపునిచ్చారు. విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గునుపూడి ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం వద్ద భక్తులకు ఉచితంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు. మానవత కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు

అత్తిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పట్నాల బాబు, కార్యదర్శి అనుపోజు అప్పలస్వామి తెలిపారు. 11, 12 తేదీల్లో పూజలు, 13న కల్యాణం, 14న పూజా కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.



వాసవీ అమ్మవారికి స్వర్ణ కిరీటం, నగలు

నరసాపురం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎన్ కళాశాల సమీపంలో ఆర్యవైశ్య రామాలయం వద్ద కొలువైన వాసవీ కన్యపరమేశ్వరి అమ్మవారికి ఆదివారం స్వర్ణ కిరీట మహోత్సవం నిర్వహించారు. ఆత్మూరి వెంకట నరసయ్య, మాణిక్యమ్మ దంపతుల వారసులు అమ్మవారికి స్వర్ణ కిరీటం, అభయ హస్తం అందించారు. ఆత్మూరి ప్రభాకర్‌రావు, ప్రకాశరావు, వెంకట నరసయ్య, సుబ్బారావు, సత్యనారాయణమూర్తి, సత్య శ్రీనివాసమూర్తి, వంశవృక్షం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

మొగల్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఆదివారం మొగల్తూరు సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయుడు పొదిల కృష్ణమూర్తి, ఎంఎస్ఆర్‌కె ప్రసాద్ పతాకాలను ఆవిష్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు చింతపల్లి కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు.



చదువు సాగేదెలా..?

అధ్యాపకుల కొరతతో విద్యార్థుల ఆందోళన

పాలకోడేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కళాశాల విద్య అందించాలనే ఉద్దేశంతో హైస్కూల్‌లోనే కళాశాల ఏర్పాటు చేసినప్పటికి అధ్యాపకుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకోడేరు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2023లో బాలికల కోసం ప్లస్ టూ కళాశాల ఏర్పాటు చేశారు. సీఈసీ, బైపీసీ కోర్సులను అందుబాటులో ఉంచారు. 2024లో శృంగవృక్షం హైస్కూల్‌లో బాలురు, బాలికలకు ప్లస్‌టూ కళాశాలలో తరగతులు ప్రారంభించారు. పాలకోడేరు కళాశాలలో 40 మంది విద్యార్థినిలు చదువుతున్నారు. శృంగవృక్షంలో ఈ ఏడాదే క్లాసు ప్రారంభం కావడంతో సీఈసీ, బైపీసీకి సంబంధించి ఆరుగురు బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఈ రెండు కళాశాలల్లో బోధనకు 9 మంది అధ్యాపకులను మాత్రమే నియమించారు. అది కూడా మూడు రోజులు పాలకోడేరు ప్లస్‌టూ కళాశాలలో, మరో మూడు రోజులు శృంగవృక్షం ప్లస్‌టూ కళాశాలలో వీరిని డిప్యూటేషన్‌పై అటూ ఇటూ మారుస్తున్నారు. దీంతో ఆయా తరగతుల్లో చదువుకునే విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధ్యాపకులు సైతం సరైన బోధన అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడి అధ్యాపకులు అక్కడే ఉండేలా చూడాలని కోరుతున్నారు.

ప్రతిరోజూ బోధన ఉండాలి



అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

-జి.ప్రశాంతి, విద్యార్థిని

పరీక్షలు వచ్చేస్తున్నాయ్



విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అధ్యాపకుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం. మార్చి నెలలో పరీక్షలంటున్నారు. అధ్యాపకులు లేకపోతే ఎలా చదివేది?

-కే.మరియ, విద్యార్థిని

రైస్‌మిల్లర్ల అన్నసమారాధన

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రాల్లో ఒకటైన గునుపూడి లోని ఉమా సోమేశ్వర, జనార్దన స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా వచ్చే భక్తులకు ఆదివారం రైస్ మిల్లర్ అర్థంపూడి బాబురావు, వెంకటలక్ష్మి దంపతుల సౌజన్యంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు ప్రారంభించారు. సంఘ కార్యదర్శి కొత్త శ్రీనివాస్ , ప్యాడి రైస్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చవాకుల నరసింహారావు, కార్యదర్శి పరుచూరి చిన నాగేశ్వరరావు, ఆలయ ఈవో రామ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీకి బోరు వితరణ

పెంటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు అంగన్వాడీ-4 కేంద్రంలో నీటి చిన్నారులకు దాతలు అండగా నిలిచారు. నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండడంతో గ్రామానికి చెందిన దాసరి ప్రభాకర్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి కాంతం, కుమారుడు నిఖిల్ బోరు అందజేశారు. అంగన్వాడీ టీచర్ జె.శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి రాధారమణ గుప్త మృతి



పాలకొల్లు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బొండాడ వెంకట రాధా రమణ గుప్త (90) ఆదివారం ఉదయం తన నివాసంలో కన్నుమూశారు. పట్టణంలో లయన్స్ కంటి ఆసుపత్రికి స్థలాన్ని, అర్బన్ బ్యాంక్ భవనానికి స్థలాన్ని ఈయన దానం చేశారు. అలాగే చాంబర్ భవన నిర్మాణానికి, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ప్రధాన దాతగా వ్యవహరించారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, చాంబర్ అధ్యక్షుడు నరసింహారావు తదితర ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు. సోమవారం ఉదయం గుప్త అంత్య క్రియలు జరపనున్నట్టు ఆయన కుమారుడు మోహన్ గుప్త తెలిపారు.

డయాలసిస్ థెరపిస్టుల సమస్యలు పరిష్కరించండి

భీమవరంటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డయాలసిస్ థెరపిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కే రహీమ్, జిల్లా అధ్యక్షుడు సాకా సురేష్ తదితరులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. కిడ్నీలు పాడైన వారికి 24 గంటలు సేవ చేస్తూ వాళ్ళ ప్రాణాలకు కాపాడుతున్న డయాలిసిస్ థెరపిస్టులకు మాత్రం సరైన జీతం, ఉద్యోగ భద్రత లేదని తెలిపారు.

9 వేలు దాటిన సభ్యత్వ నమోదు : పొత్తూరి

నరసాపురం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డులో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టింది. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు కార్డులందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 9 వేలు దాటాయన్నారు. ఇదే రీతిలో సభ్యత్వాలు నమోదు చేపడితే 40 వేల టార్గెట్‌ను పూర్తి చేస్తామన్నారు. కావున పార్టీ శ్రేణులు టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు.



సీపీఎం మహాసభ

భీమవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రజలపై పలు రూపాల్లో భారం వేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం భీమవరంలో పార్టీ 9వ మహాసభలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. పార్టీ టౌన్ కార్యదర్శిగా వాసుదేవరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 9 మందితో నూతన పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షవర్గంగా బొక్కా సత్యనారాయణ, ఎం వైకుంఠరావు, బి వరలక్ష్మి ఉన్నారు.



భీమవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

104 ఉద్యోగుల ధర్నా

భీమవరం క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యమని పీడీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బి. గోపి మూర్తి అన్నారు. 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, 104 వ్యవస్థను వైద్య ఆరోగ్యశాఖలో విలీనం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజారామ్మోహన్‌రాయ్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. విజయకుమార్, ఎస్. సురేష్, ఉపాధ్యక్షులు సుందర్‌సింగ్, సీనియర్ ఉద్యోగి సత్యనారాయణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు ఎం. ఆంజనేయులు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి

ఇరగవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవాన్ని నవంబరు 26న ఘనంగా జరుపుకోవాలని రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డీవీవీఎస్ వర్మ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని తణుకులో కార్మిక సంఘాలు, పౌరసంఘాలు, పలు తరగతుల ప్రజా సంఘాలు ఐక్య ఉద్యమంగా నిర్వహించుకు నేందుకు తణుకు సురాజ్యభవనంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓటు తోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, రాజ్యాంగం ప్రకారం మనం హక్కుదారులం అన్న గుర్తింపుతో రాజ్యాంగాన్ని అమలు చేసేలా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూసీ నాయకులు సీవీ ప్రతాప్,



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏఐటీయూసీ నాయకులు దేవ పెద్దిరాజు, సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు పేరూరి మురళీ కుమార్, గొల్లపల్లి అంబేడ్కర్, సమతా ఎడ్యుకేషన్ సొసైటీ నాయకులు నీలం మాల్యాద్రి, డాక్టర్ రమేష్ చంద్రబాబు, కామన మునిస్వామి, కౌరు వెంకటేశ్వర్లు, ఎస్.మనోరమ, జి.కరుణాకర చౌదరి తదితరులు పాల్గొన్నారు.



జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం

ఉండి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావంను విజయవంతం చేద్దామని వీహెచ్‌పీ రాష్ట్ర మహిళా కన్వీనరు సునీతాదేవి అన్నారు. ఆదివారం ఉండి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హైందవ శంఖారావం సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్ బీజేపీ కన్వీనరు పేరిచర్ల సుభాష్‌రాజు మాట్లాడుతూ తమ పార్లమెంట్ పరిధిలో లక్ష మందిని తీసుకువస్తామన్నారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ ప్రచారక్ స్వామి సుందర, గోదావరి విభాగ సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, జగన్‌మోహన్‌రావు తదితరులు ప్రసంగించారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

ఆకివీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఫీడర్ రోడ్ వర్తకులు స్వచ్ఛందంగా ఆక్రమణలు ఆదివారం తొలగించారు. ఇటీవల ఆకివీడు పర్యటనలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ఆక్రమణలు తొలగించాలని స్వయంగా తెలిపారు. అలాగే నగర పంచాయతీ అధికారుల హెచ్చరికలతో వర్తకులు ఆక్రమణలు తొలగించుకున్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ యోగా సనా జాతీయ పోటీలకు దండగర్ర జడ్పీ హైస్కూల్ పీడీ బడుగు చంద్రశేఖర్ ఎంపికయ్యారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో విజేతగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు.

నేడు మహదేవపట్నానికి ట్రైనీ ఐఏఎస్‌లు

ఉండి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహదేవపట్నం గ్రామానికి ట్రైనీ ఐఏఎస్‌లు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం ట్రైనీ ఏఏఎస్‌లు గ్రామానికి విచ్చేసి పరిశీలిస్తారని తెలిపారు. గ్రామానికి వారి రాకకు సంబందించి ఆయా ఏర్పాట్లును గావిస్తున్నట్లు సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ, ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజులు తెలిపారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ

ఇరగవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్రైస్తవ ఉజ్జీవ సభలు నిర్వహించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని ఆదివారం క్రైస్తవ సంఘాల నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. సభకు అనుమతులున్నా అధికారులు కక్షపూరితంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.



సభా మందిరాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

ఆర్ఎస్ఎస్ సభా మందిరం ప్రారంభించిన కేంద్ర మంత్రి

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఆర్ఎస్ఎస్ సభా మందిరాన్ని ఆదివారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు ప్రారం భించారు. ఈ సందర్భంగా శృంగవృక్షం శ్రీదత్త పీఠం పీఠాధిపతులు శ్రీసాయి దత్త నాగానంద సరస్వతీ స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. మంతెన రామచంద్రరాజు, కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, డాక్టర్ యిర్రింకి సూర్యారావు, వబిలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొనకళ్ళను అభినందిస్తున్న అంగర

ఆర్టీసీ సేవలు మెరుగుపరచండి

పాలకొల్లు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో దారుణంగా మారిన ఆర్టీసీ బస్సులు, డిపోల నిర్వహణ మెరుగుపరచాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఒక ప్రైవేటు కార్యక్రమానికి పాలకొల్లు వచ్చిన నారాయణను అంగర కలసి అభినందించారు. ఇప్పటికే కొత్త బస్సులు కొనుగోలు చేశామని, మరిన్ని సేవలు విస్తృత పరుస్తామని నారాయణ హామీ ఇచ్చినట్టు అంగర తెలిపారు.

14న ధర్నాలు జయప్రదం చేయాలి

ఇరగవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తణుకులోని జయంతి కాలనీలో నిరుపేదలైన యానాదులకు ప్రభుత్వం పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా జయంతి కాలనీలో ఇంటింటికి కరపత్రం పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గణపవరం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ కోరారు. ఆదివారం గణప వరంలో ప్రజా పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, జమిలి ఎన్నికల అంశాన్ని ముందుకు తెచ్చి ప్రజా సమస్యలు పక్కన పెడుతున్నారన్నారు. నరసింహమూర్తి, చిననాగేశ్వరరావు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెంటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముదునూరులో కూటిపూడి వీర్రాజు సహకారంతో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గొర్రెపాటి సింహాచలం, తమటపు రాంపండు, బాజింకి నాగరాజు కమిటి సభ్యులు తెలిపారు

అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

పెంటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడులో అర్హులుగా గుర్తించిన 523 మందికి తక్షణమే గ్రామంలో లేదా పరిసర గ్రామంలో ఇంటి స్థలాలు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు కోరారు. ఆదివారం గ్రామంలోని ఇంటి స్థలాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలు ఇస్తారని ఎదురుచూసినా నిరాశే మిగిలింద న్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా స్థలాలు కేటాయించాలని కోరారు

ఉచిత వైద్య సేవలు

ఇరగవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు ఆదివారం తణుకు, మండపాక గ్రామంలో నిర్వహించారు. నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్యులు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించి పలు సూచనలు చేశారు. సంఘ సభ్యులు అక్కిన కాశీ విశ్వనాధం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్థి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పులమోలు వంశీయుల కార్తీక వనసమారాధన

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం పది కుటుంబాలతో ప్రారంభమైన పులమోలు వంశస్థులు ఆదివారం వందల కుటుంబాల వారు ఆత్మీయ కలయికగా సహపంక్తి భోజనం చేశారు. తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో కార్తీక వనసమారాధన నిర్వహించారు. అన్ని కుటుంబాల వారు కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. కార్యక్రమానికి పొలమోలు రాముడు (కర్నాటక), వెంకటేశ్వరరావు (కొండ్రుప్రోలు), సర్వేశ్వరరావు (హైదరాబాద్), త్రినాథ్ (కొండ్రుప్రోలు) నాయకత్వం వహించారు.



అటపాకలో ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్లు



తూర్పుతాళ్లలో ఆర్యవైశ్య సమారాధన..



రిటైర్డ్ ఎస్పీ హరికృష్ణ దంపతులకు సత్కారం



నినాదాలు చేస్తున్న దేవాంగుల సంఘం నాయకులు



వనసమారాధనలో పాల్గొన్న పులమోలు వంశీయులు

వన సమారాధనల సందడి

కైకలూరు/ఆకివీడు, నవంబరు 10: ఐక్యతకు ప్రతీకలు కార్తీక వనసమారాధనలని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. ఏలూరు జిల్లా అటపాక పక్షుల విహార కేంద్రం వద్ద ఆదివారం జోన్ చైర్‌పర్సన్లు మద్రివాడ శ్రీనివాసరావు, వేగేశ్న వెంకట కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆకివీడు లయన్స్ క్లబ్ జోన్ సోషల్ మీట్ కార్తీక వనసమారాధన నిర్వహించారు. దివ్యాంగుడికి మూడు చక్రాల రిక్షా, విద్యార్థినులకు సైకిళ్ళు, ఆకివీడు శాఖా గ్రంథాలయానికి సౌండ్ సిస్టమ్ అందచేశారు. లయన్స్ ప్రముఖులను సన్మానించారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు డాక్టర్ ఎంవీఎస్ సూర్యనారాయణరాజు, ఈపూరి సత్యనారాయణ, చి లుకూరి కృష్ణంరాజు, లయన్స్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్వీఎస్ సూర్యనారాయణరాజు, దాట్ల రామరాజు, పిన్నమరాజు మురళీరాజు, గొట్టుముక్కల బాబు, ముదుండి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో ఆర్యవైశ్యులు, భక్తమార్కండేయ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో జవహర్‌పేటలోని రైస్‌మిల్లు వద్ద వన సమారాధనలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గొంట్లా గణపతి, నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సి. సుబ్రమణ్యం, వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్. బ్రహ్మం అన్నారు. ఆదివారం తూర్పుతాళ్ళులో ఆర్యవైశ్య కార్తీక సమారాధనకు వారు ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. కె.రఘురాం, ఉపాధ్యక్షులు నూలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: కవిటంలో ఆదివారం పోడూరు మండల గౌడ, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ గౌడ, శెట్టి బలిజ కులస్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని కోరారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎస్పీ తంగెళ్ల హరికృష్ణ దంపతులను సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, సంఘ మండల అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: నామినేటెడ్ పదవుల్లో దేవాంగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన దేవాంగుల కార్తీక సమారాధనకు ముఖ్య అతిథులుగా వట్టెం గణేశ్వరరావు, ఆనందప్రసాద్, శివశంకర్, దుర్గాప్రసాద్ విచ్చేసి విలేకర్లతో మాట్లాడారు. తమకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు.

ఆచంట: వల్లూరులో కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబుతో పాటు దేవళ్ళ రమేష్, తాళం శ్రీనివాస్, గెద్దాడ సన్యాసిరావు పలు గ్రామాల సర్పంచ్‌లతో పాటు కమ్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గణపవరం: కార్తీక వనసమారాధనలు సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేస్తాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం పిప్పర శివాలయం వద్ద ఆయన ఆధ్యాత్మికవేత్త కొలనువాడ సుబ్బరాజు ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు.ఎంపీపీ దండు రాము, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో హౌసింగ్‌బోర్డ్ కాలనీ వద్ద ఆదివారం కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘం కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. వన సమారాధనలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి వలవల బాబ్జి పాల్గొని మాట్లాడారు. అనంతరం బాబ్జిని సత్కరించారు. గంధం సతీష్, యడ్లపల్లి శ్రీను, సట్నీసు కృష్ణమోహన్,



వల్లూరు వనసమారాధనలో పాల్గొన్న పితాని వెంకట్



వలవల బాబ్జిని సత్కరిస్తున్న దృశ్యం